జీజీహెచ్‌లో పారిశుధ్యం డొల్ల


మురుగు నిలిచి అపరిశుభ్రంగా పరిసరాలు


వర్షం నీరు నిలిచి దోమల వృద్ధికి కారణమవుతున్న జీజీహెచ్ ప్రాంగణం


వర్షం కురిస్తే హాస్పిటల్ 2వ గేట్ రోడ్డు దుస్థితి ఇదీ..


డ్రైనేజీ లేకపోవడంతో నిలిచిన మురుగు

- కాలువల్లో పూడిక తీయకపోవడంతో దుర్వాసన
- దోమల వృద్ధి కేంద్రంగా జీజీహెచ్ ఆవరణ

మార్కాపురం:

డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని జీజీహెచ్ వైద్యశాలలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. అనారోగ్యంతో వైద్యశాలకు వెళ్తే కొత్త రోగాలు అంటుకునే విధంగా అక్కడ పరిస్థితి ఉందని రోగులతోపాటు వారి బంధువులు ఆందోళన చెందుతున్నారు. కొద్దిపాటి వర్షానికే వైద్యశాలలో అంతర్గత రోడ్లు బురదమయంగా మారిపోతున్నాయి. బ్లడ్ బ్యాంకుకు, ప్రసూతి విభాగానికి వెళ్లే రోడ్డుపై గుంతలు పడగా ఆయా విభాగాల పక్కన మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. పగటి పూట సైతం దోమలు విజృంభిస్తుండటం జీజీహెచ్‌లో పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రస్తుతం రోజూ 250 నుంచి 300 మంది రోగులు, వారి సహాయకులు వైద్యశాలకు వస్తున్నారు. అలాగే 30 నుంచి 50 మంది వరకు ఇన్‌పేషంట్లు ఉంటున్నారు. మందులకు, టీ, కాఫీ, టిఫిన్ల కోసం బయటకు వస్తే దోమలు ముసురుకుంటుండటంతో పలాయనం చిత్తగిస్తున్నారు.

అధికారుల స్పందన శూన్యం

వైద్యశాలలోని అంతర్గత పైపులైన్లు పగిలిపోయి మురుగు బయటకు వచ్చి అక్కడే నిలిచి దుర్వాసన వస్తోంది. ముఖ్యంగా గైనకాలజీ విభాగం నుంచి వచ్చే రోడ్డు, హాస్పిటల్ రెండో గేటు(పాత గేటు) వద్ద పారిశుధ్యంగా దారుణంగా తయారైంది. ఆస్పత్రి నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను ఆవరణలోని ఓ మూలన వేసి కాలుస్తుండటంతో పొగ వ్యాపించి రోగులు ఇబ్బంది పడుతున్నారు. జీజీహెచ్‌కు ఉన్నతాధికారులు వస్తున్నప్పటికీ పారిశుధ్యం మెరుగుదలపై దృష్టి సారించకుండా కేవలం రోగులకు అందుతున్న సేవలు, మందుల వివరాలు మాత్రమే ఆరా తీస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ మడుగు దాటితేనే దరిమడుగు!


మార్కాపురం-దరిమడుగు రోడ్డులో నిలిచిన వర్షం నీరు

మార్కాపురం: ఇక్కడ కనిపిస్తున్నది నీటి కుంట అనుకుంటే పొరపాటే. నిత్యం జనం రాకపోకలు సాగించే మార్కాపురం-దరిమడుగు రోడ్డు. చినుకు పడితే చాలు నీరు చేరి బురదగా మారి నీటి కుంటను తలపిస్తోంది. ఈ గ్రామం నుంచి రోజూ సుమారు వెయ్యి మందికిపైగా గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామంలో సుమారు 50 ఆటోలు, 100 టూవీలర్లు ఉన్నాయి. వీరందరూ పనుల నిమిత్తం ఈ రోడ్డు గుండానే మార్కాపురం పట్టణానికి రావాల్సి ఉంది. ఈ మార్గంపై అవగాహన లేనివారు బైక్‌లపై వస్తూ అదుపుతప్పిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు స్పందించి తక్షణమే గుంతలు పూడ్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొమరోలు: మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చెన్నారావు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు పాల్గొనాలని, అధికారులు తమ పరిధిలోని శాఖాపరమైన సమాచారంతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు.

17 నుంచి ఆటల పోటీలు

బేస్తవారిపేట: మండలంలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్లో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎస్.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అండర్-14, అండర్-19 విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. 17వ తేదీన బాలబాలికలకు అథ్లెటిక్స్, 18 నుంచి 19వ తేదీ వరకు గేమ్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలను బేస్తవారిపేట జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పి.రమణారెడ్డికి అందజేయాలని ఎంఈఓ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు చేస్తున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కసినేపల్లి, చింతలపల్లి, వర్ధనపల్లె గ్రామాల్లో నూతన విద్యుత్ లైన్లు వేస్తున్న కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

చినమనగుండంలో సాయి పాదుకా మహోత్సవం


రామాలయం వద్ద పాదుకా మహోత్సవం

కొనకనమిట్ల: సత్య సాయి పాదుకా మహోత్సవంలో భాగంగా ఆదివారం మండలంలోని చినమనగుండంలో గ్రామ సేవా మహాయజ్ఞం నిర్వహించారు. భజన కార్యక్రమాల అనంతరం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం రామాలయం వద్ద గ్రామ సత్యసాయి భజన మండలి సభ్యుడు ఈర్ల బాలవెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పలువురు గర్భిణులకు సీమంతం నిర్వహించి ఆశీర్వదించారు. గ్రామస్తులకు సత్యసాయి ప్రసాదాలు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కాపురం, పొదిలి, కంభం, బేస్తవారిపేట, కొమరోలుకు చెందిన సుమారు 100 మంది సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరి పోలేరమ్మ తల్లికి పూజలు


ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని నాగ శిలలు, పుట్టకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే కళాశాల రోడ్డులో ఉన్న పోలేరమ్మ అమ్మవారికి అర్చకులు అమర్నాథ్ విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

పోలేరమ్మా దీవించమ్మా..


అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి

కొనకనమిట్ల: మహాలయ పక్షాన్ని పురస్కరించుకొని మండలంలోని గొట్లగట్టు గ్రామంతోపాటు హరిజన కాలనీ వాసులు ఆదివారం సాయంత్రం గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. హరిజన కాలనీ వాసులు కుంకుమ బండ్లతో ఉత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించారు.

హలో అన్నా ఏ ఊరిది?

- కొన్ని చోట్ల చెరిగిపోయిన నేమ్ బోర్డులు..
- మరికొన్ని చోట్ల అస్పష్టంగా ఉండటంతో వాహనదారుల తికమక


చెరిగిపోయిన గోగినేనివారిపాలెం నేమ్‌బోర్డు


ముళ్ల పొదల్లో ఉన్న రాజుపాలెం నేమ్ బోర్డు


ఆముదాలపల్లి వద్ద ఖాళీ బోర్డు

పొదిలి రూరల్:

హైవే వెంట గ్రామాల నేమ్ బోర్డులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఎక్కడో ఓ చోట బోర్డు ఉన్నా ఊరి పేరు స్పష్టంగా లేకపోవడం, కొన్ని చోట్ల బోర్డులపై పేర్లు పూర్తిగా చెరిగిపోవడంతో వాహనదారులు తికమక పడుతున్నారు. ముళ్లపొదలు, డొంకలు, చెట్ల కొమ్మల చాటున బోర్డులు దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి నేమ్ బోర్డులు సక్రమంగా ఏర్పాటు చేయించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.